క్లుప్తంగా

వైభవంగా రథోత్సవం


రథంపై ఊరేగుతున్న లక్ష్మీజనార్దనస్వామి

రామసముద్రం : మండల కేంద్రంలో వెలసిన శ్రీ లక్ష్మి జనార్దనస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మి జనార్దనస్వామివారిని రథోత్సవంపై వైభవంగా ఊరేగించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. బలిజసంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి ఆలయం వద్ద పౌరాణిక నాటకం ప్రదర్శించారు. కార్యక్రమంలో కోలా హరి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల సత్తా


ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

మదనపల్లె సిటీ: చెన్నై ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్శిటీ నిర్వహించిన కరాటే పోటీల్లో లీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. విద్యార్థులు పునీత్ కుమార్, మోహిత్‌కుమార్, అర్బాజ్, జహీర్, కె.హారిక, మిథున్, యువరాజ్ ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్స్ అందుకున్నారు. విద్యార్థులను లీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు మురళి, కోచ్‌లు అభినందించారు.

సత్వర చర్యలు చేపట్టండి


మాట్లాడుతున్న ఎస్‌డీసీ రాఘవేంద్ర

పెద్దతిప్పసముద్రం: రెవెన్యూ సిబ్బంది ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సత్వర చర్యలు చేపట్టాలని హంద్రీనీవా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.రాఘవేంద్ర ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వీఆర్‌ఓలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఓలు ముందస్తుగా రైతులకు నోటీసులు అందించి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి భూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీరాములు నాయక్, డీటీ విద్యాసాగర్, ఆర్ఐ బాలాజీ, సర్వేయర్ శ్రీవాణి ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం


నాగేంద్రను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి భరోసా ఇచ్చారు. స్థానిక మోడల్ కాలనీకి చెందిన నాగేంద్ర, అతని భార్య ఇటీవల బంధువుల వేధింపులతో ఆత్మహత్యా యత్నం చేశారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే మోడల్ కాలనీకి చేరుకుని నాగేంద్ర దంపతులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు వేధింపులు అధికమయ్యాయని ఆరోపించారు. అధికార పార్టీ నాయకులు తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. అలాగే పీలేరు మండలం యర్రదొడ్డిపల్లెకు చెందిన చక్రపాణిరెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఉస్తికాయలపెంట గ్రామం దేవాండ్లపల్లెకు చెందిన ఆనంద్‌రెడ్డి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్‌లు దండు జగన్‌మోహన్‌రెడ్డి, చింతల రమేష్‌రెడ్డి, హబీబ్‌బాషా, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

పెద్దతిప్పసముద్రం: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండల, గ్రామ పంచాయతీ నిధులను అధికంగా నీటి సమస్యలకే ఖర్చు చేయాలన్నారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి మూడవ శనివారం పారిశుద్ధ్య నిర్వహణ ఖచ్చితంగా చేపట్టాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బాలచంద్రాచారి ఉన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

పీలేరు రూరల్ : బీజేపీని గ్రామస్థాయి నుంచి బలోపేతానికి కృషి చేస్తామని ఏపీ బీజేపీ అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బీజేపీ నాయకులు బి. చంద్రశేఖరరెడ్డి, బి. వెంకటరమణ పాల్గొన్నారు.

టమాట.. నష్టాల బాట!

- తగ్గిన దిగుబడి
- ఆశాజనకంగా లేని ధరలు
- వెలవెలబోతున్న మదనపల్లె మార్కెట్


మదనపల్లె మార్కెట్‌కు వచ్చిన టమాటాలు

మదనపల్లె సిటీ: రబీ సీజన్‌లో ఉద్యాన పంటగా.. టమాటా సాగు చేస్తున్న రైతులకు ఏటా నష్టాలు తప్పడం లేదు. ఓవైపు ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నారు. ధర పెరిగినంత వరకూ.. పంటను దాచుకునేందుకు కోల్డ్‌స్టోరేజీలు లేక దళారులను, వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. తక్కువ ధరకే విక్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు. వ్యాపారులు మాత్రం అధిక ధరకు విక్రయించి లాభపడుతున్నారు. ఫిబ్రవరి నెలాఖరు నుంచి ఆగస్టు వరకు టమాటాకు సీజన్. ప్రతి ఏడాది మార్కెట్‌కు 300 టన్నుల నుంచి 800 టన్నుల టమాటాలను రైతులు తెచ్చేవారు. అయితే ప్రస్తుతం కేవలం 50 టన్నులకు పరిమితమైంది. దీంతో మార్కెట్ వెలవెలబోతోంది.

దిగుబడి తగ్గుముఖం

మదనపల్లె మార్కెట్‌కు మదనపల్లె పరిసర ప్రాంతాల నుంచి మాత్రమే కాయలు వస్తున్నాయి. దిగుబడులు చాలా వరకు తగ్గుముఖం పట్టాయి. బయట ప్రాంతాలకు ఎగుమతులు పెరిగితే ధరలు పెరిగే అవకాశాలున్నాయి. బుధవారం మొదటి గ్రేడ్ 10 కేజీలో రూ.180, రెండవ గ్రేడ్ 10 కేజీలు రూ.146 పలికింది.

తేదీ	గరిష్ట ధర (మొదటిగ్రేడ్)	గరిష్ట ధర (రెండో రకం)
9-2-2025	రూ.200.00	రూ.150.00
10-2-2025	రూ.200.00	రూ.150.00
11-2-2025	రూ.180.00	రూ.90.00
12-2-2025	రూ.180.00	రూ.90.00

ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతోపాటు మార్కెట్‌కు వస్తున్న కాయలకు గిట్టుబాటు కాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్‌సీజన్ కావడం, బయటి మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడంతో ఎగుమతులు లేవని అధికారులు చెబుతున్నారు.

గిట్టుబాటు కాలేదు



రెండు ఎకరాల్లో టమాటా పంట పెట్టాను. ప్రస్తుతం ధరలు అంత ఆశాజనకంగా లేదు. కనీసం కూలీలకు కూడా గిట్టుబాటు కాలేదు. ధరలు పెరగకపోతే నష్టపోవాల్సి వస్తుంది. బయట ప్రాంతాలకు ఎగుమతులు పెరిగే ధరలు పెరిగే అవకాశం ఉంది. దళారుల చేతితో నష్టపోతున్నాం. గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలి.

-బావానాయక్, రైతు, నిమ్మనపల్లె

ప్రతి రైతుకూ గుర్తింపు సంఖ్య తప్పనిసరి

జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్


రైతులతో మాట్లాడుతున్న చంద్రనాయక్

కలకడ : జిల్లాలో ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను తప్పనిసరిగా పొందాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రనాయక్ అన్నారు. బుధవారం కలకడ వ్యవసాయశాఖ అధికారి కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రైతుల వివరాలు ఆన్‌లైన్ నమోదు గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వారికి మరింత చేరువ చేయడానికి ఆధార్ తరహా ప్రత్యేక కార్డులు జారీ చేయనున్నారని పేర్కొన్నారు. ఇది వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ (భారత ప్రభుత్వం) సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ చేపడుతున్న బృహత్తర కార్యక్రమమని చెప్పారు. ఆధార్ కార్డు తరహాలో ప్రతి రైతుకు ఒక యూనిక్ కోడ్(యూసీ) కేటాయించేందుకు చర్యలు ప్రారంభించారని తెలిపారు. మన రాష్ట్రంలో ఈ పోర్టల్ జనవరి 26వ తేదీ నుంచి అందుబాటులోకి వచ్చిందన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీలో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు కేంద్ర ప్రభుత్వం ఆధార్ తరహాలో 14 అంకెలతో కూడిన ప్రత్యేక కార్డును జారీ చేస్తుందని, ఇది రైతుకు గుర్తింపు కార్డుగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుకు రైతు ఆధార్ నంబర్, ఆధార్ అనుసంధానిత ఫోన్ నంబర్, భూమి రికార్డుల వివరాలు (పట్టదారు పాస్‌పుస్తకం, ఈమెయిల్ ఐడీ ఉన్న రైతులు ఐడీ నంబర్ తీసుకొని గ్రామంలోని రైతు సేవా కేంద్రం సిబ్బందిని కలిసి నమోదు చేయించుకోవాలని సూచించారు. మండల వ్యవసాయశాఖ అధికారి ఎంపీ లావణ్య, జిల్లా వ్యవసాయశాఖ ఏఓ వెంకటమోహన్, అమృత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

దారి చూపండి సారూ..!

- కలెక్టర్‌కు కోటవారిపల్లె తండా వాసుల వినతి
- 20 ఏళ్లుగా పరిష్కారం కాలేదని ఆవేదన


కలెక్టర్ శ్రీధర్ చామకూరికి వినతిపత్రం అందజేస్తున్న కోటవారిపల్లె తండా వాసులు

మదనపల్లె : ప్రభుత్వాలు మారుతున్నాయి. అధికారులు వస్తూ, పోతున్నారు. అయితే 20 ఏళ్లుగా దారి సమస్య పరిష్కారం కాలేదని కోటవారిపల్లె, ఉడుంవారిపల్లె తండాలకు చెందిన గిరిజన ప్రజలు కలెక్టర్ శ్రీధర్ చామకూరికి విజ్ఞప్తి చేశారు. బుధవారం మదనపల్లె మండల పీజీఆర్ఎస్ అర్జీల సమీక్షా సమావేశానికి హాజరైన కలెక్టర్ శ్రీధర్ చామకూరిని తండావాసులు కలిసి తమ ఆవేదన వ్యక్తం చేశారు. 1990లో దాదాపు 70 కుటుంబాలకు అప్పటి ప్రభుత్వం గిరిజన కాలనీలను మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన స్థలంలో ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నామని తెలిపారు. అయితే ఈ కాలనీలకు రోడ్డు సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ వచ్చేందుకు అవకాశం లేదన్నారు. రోడ్డు సమస్యపై 20 ఏళ్లకు పైగా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎస్టీ కమిషన్ మెంబర్లకు వినతులు ఇస్తూనే ఉన్నామే తప్పా.. ఇప్పటి వరకు సమస్య పరిష్కారం కాలేదన్నారు. కలెక్టర్ హోదాలో తమ తండాను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే తమ సమస్య అర్థమవుతుందని వాపోయారు. మున్నానాయక్, శీనునాయక్, రెడ్డినాయక్, జయరామ్, చిన్నానాయక్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ అదాలత్‌లో ఫిర్యాదులు


మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి ఆంజనేయమూర్తి

కలికిరి: పీలేరు నియోజకవర్గ స్థాయిలో కలికిరి సబ్ డివిజన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక విద్యుత్ లోక్ అదాలత్‌లో పలువురు రైతులు ఫిర్యాదులు చేశారు. విశ్రాంత జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు కె.రామ్మోహన్‌రావు, సాంకేతిక సభ్యులు ఎస్.ఎల్. అంజనీకుమార్ హాజరై వినతులు స్వీకరించి, పరిష్కార చర్యలపై అధికారులను ఆదేశించారు. పీలేరు మండలం గోరంట్లపల్లికి చెందిన రైతు జి.అశ్వినీకుమార్ గత ఏడాది అక్టోబరు 24న ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రూ.21వేలు చెల్లించినా ఇప్పటి వరకు అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయలేదని, కలికిరి మండలం పత్తేగడ గ్రామం కొటాలకు చెందిన శివయ్య వ్యవసాయ సర్వీసు ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశాడు. ఎస్ఈ ఆర్. చంద్రశేఖర్‌రెడ్డి, పీలేరు ఈఈ వై.చంద్రశేఖర్‌రెడ్డి, డీఈఈ శివయ్య, ఏఈఈ అన్వర్ బాషాపాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు


హెచ్చరిక బోర్డు పెట్టించిన తహసీల్దార్ భీమేశ్వర్‌రావు

పీలేరు : ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పని తహసీల్దార్ భీమేశ్వర్‌రావు అన్నారు. స్థానిక నాగిరెడ్డికాలనీలో సర్వే నంబరు 72/2లో రెండు రోజులుగా చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై బుధవారం వివిధ దినపత్రికల్లో వార్తలు ప్రచురితమయ్యాయి. దీంతో స్పందించిన తహసీల్దార్ ఆ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవన్నారు. అక్రమ నిర్మాణాలపై కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ ఈ. వెంకటరెడ్డి


విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఎస్. కృష్ణారెడ్డి, అధ్యాపకులు

మదనపల్లె : జేఈఈ మెయిన్ సెషన్ 1 ఫలితాల్లో శ్రీ కృష్ణారెడ్డి సిద్ధార్థ విద్యార్థులు ఆల్‌టైమ్ రికార్డు సృష్టించినట్లు ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణారెడ్డి తెలిపారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మంగళవారం విడుదల చేసిన జేఈఈ మెయిన్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచి సత్తా చాటారన్నారు. కళాశాల విద్యార్థి కే.సాయి సుద్దిక్ష, డి.పవన్‌తేజ్‌రెడ్డి, ఎస్.స్పందన, ఏ.వెంకట సాయిదీపక్ మంచి ఫలితాలు సాధించారని కొనియాడారు. వీరితోపాటు కళాశాలకు చెందిన 30 మంది విద్యార్థులు మంచి మార్కులతో ప్రతిభ కనపరిచారన్నారు.

శ్రీ సిద్ధార్థ ప్రభంజనం

దేశంలో అత్యంత ప్రతిష్టాత్మక జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో వెంకటరెడ్డి శ్రీ సిద్ధార్థ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. నేషనల్ టెస్ట్ ఏజెన్సీ మంగళవారం ప్రకటించిన జేఈఈ-మెయిన్ సెషన్-1 ఫలితాల్లో తమ విద్యార్థులు ఆల్ ఇండియా లెవెల్‌లో అత్యుత్తమ పర్సంటైల్ సాధించి పట్టణంలో ప్రథమ స్థానంలో నిలిచారని కరస్పాండెంట్ ఈ.వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం కళాశాలలో జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటుచేశారు. ఆయన మాట్లాడుతూ బి.తనుశ్రీ, ప్రథమస్థానం, పి.దేదీప్యసాయి ద్వితీయస్థానం సాధించారన్నారు. వీరితోపాటు 35మంది విద్యార్థులు ప్రతిభ కనపరిచారన్నారు. డైరెక్టర్ ఈ.హేమంత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ


మాట్లాడుతున్న ఎంపీడీఓ అబ్దుల్‌రహీం

కలకడ : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ చేపడుతున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్‌రహీం తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సామాజిక తనిఖీ కార్యక్రమంలో సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 16 పంచాయతీల్లో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 486 పనులుకు రూ.7.47 కోట్లు ఖర్చుచేసినట్లు తెలిపారు. సామాజిక తనికీ సిబ్బందికి మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకం క్షేత్రసహాయకులు, సాంకేతిక సహాయకులు, గృహనిర్మాణశాఖ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, సహకరించి తనిఖీ సిబ్బందికి రికార్డులు అందించాలని ఆదేశించారు. లో ఏపీఓ చెన్న కేశవులు, సుబ్బారావు, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కోటి దీపోత్సవం

కలికిరి (వాల్మీకిపురం): వాల్మీకిపురం పట్టణ పరిధిలో కోనేటి వీధిలో వెలసిన శ్రీలక్ష్మీ కామేశ్వర స్వామి ఆలయంలో బుధవారం మాఘ పౌర్ణమి సందర్భంగా భక్తిశ్రద్ధలతో కోటి దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, చింతల నీరజ దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు దీపారాధన చేశారు.


దీప కాంతులతో దేదీప్యంగా వెలిగిపోతున్న ఆలయ ప్రాంగణం

వైభవంగా వసంతోత్సవం


ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి, శ్రీనివాసుడు

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో పది రోజులుగా స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం టీటీడీ ఆగమ సలహాదారులు శ్రీనివాసచార్యులు, అర్చకులు కృష్ణప్రసాద్‌భట్టార్, రమేష్‌బాబు, ధనుష్, క్రిష్ణమూర్తి స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణస్వామికి వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామికి చక్రస్నానం చేశారు. రాత్రి ధ్వజా అవరోహణం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ గోపినాథ్, ఇన్‌స్పెక్టర్ దుష్యంత్‌కుమార్, నగేష్, నాగరాజ, భక్తులు పాల్గొన్నారు.

గౌరవ డాక్టరేట్ ప్రదానం


రమేష్‌ను సన్మానిస్తున్న బాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు శివప్రసాద్

మదనపల్లె : పీటీకే ఫౌండేషన్ చైర్మన్ మర్రిపాటి రమేష్, సామాజిక సేవా విభాగంలో భారత్ వర్చువల్ యూనివర్శిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు. ఈ నేపథ్యంలో డాక్టర్ మర్రిపాటి రమేష్‌ను, స్థానిక భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) కార్యాలయంలో బుధవారం బాస్ వ్యవస్థాపకుడు పీటీఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో సన్మానించారు. మర్రిపాటి రమేష్ 20ఏళ్లుగా చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని నిర్వాహకులు కొనియాడారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ పోతబోలు రెడ్డప్ప, రిటైర్డ్ హెచ్ఎం దేవరింటి నరసింహులు, జర్నలిస్ట్ చామంచుల శ్రీనివాస్ గౌడ్, బాస్ జిల్లా కన్వీనర్ ముత్యాల మోహన్, రెడ్డెప్ప పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో బుధవారం మాఘమాసం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున స్వామిని దర్శించుకున్నారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జున స్వామి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మల్లయ్యకొండకు వెళ్లే మార్గమధ్యంలో వెలసిన ఏనుగు మల్లమ్మ ఆలయంలో మాఘపౌర్ణమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

పీలేరు : స్థానిక రిటైర్డ్ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. బుధవారం నిర్వహించి కంటి వైద్య శిబిరంలో తిరుపతికి చెందిన అమెరికన్ లేజర్ ఐ హాస్పిటల్ వైద్యులు సుమారు 90 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 16 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. రిటైర్డ్ పెన్షనర్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల అరెస్టు దుర్మార్గం

రాజంపేట రూరల్ : విధుల నుంచి తొలగించారని రిలే దీక్షలు చేస్తున్న ఏపీ ఎండీసీ స్కూల్‌లో పనిచేసిన కార్మికులను అరెస్టు చేయటం దుర్మార్గమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చిట్వేలి రవికుమార్ మండిపడ్డారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఓబులవారిపల్లి మండలం మంగంపేటలోని ఏపీఎండీసీ పబ్లిక్ స్కూల్‌లో హౌస్ కీపింగ్, స్కావెంజర్స్‌గా పనిచేస్తున్న కార్మికులు జీతాలు చెల్లించాలని కోరితే వారిని విధుల నుంచి తొలగించడం అన్యాయమని నిలదీశారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి అడ్డంకులు

బి.కొత్తకోట: బి.కొత్తకోట జ్యోతిచౌక్‌లో 45 ఏళ్ల క్రితం రక్షిత నీటి ఓవర్ హెడ్ ట్యాంక్‌ను నిర్మించారు. బుధవారం దీనిపై వివాదం మొదలైంది. నగర పంచాయతీ అధికారులు ట్యాంకు కింద ఓ భాగంలో మరుగుదొడ్లను, చిన్నబిడ్డల తల్లుల కోసం ఫీడింగ్ రూం నిర్మించేందుకు సిద్ధమయ్యారు. ఇంతలో కొందరు ఇది తమ భూమి, ఆలయానికి చెందిందంటూ నిర్మాణానికి అభ్యంతరం చెప్పడంతో కార్మికులు పనులు ఆపేశారు. దీనితో కమిషనర్ పల్లవి విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పట్టణ నడి బొడ్డులోని ఈ ట్యాంకు స్థలం తమదని చెబుతున్న వ్యక్తులు సర్వే నిర్వహించాక నిర్మాణాలు చేపట్టాలని కోరారు. దీంతో అధికారులు పనులు ఆపేశారు. ఈ సమస్యపై ప్రైవేటు వ్యక్తులు తమ స్థలమని చెబుతుండటంపై రెవెన్యూ అధికారులతో విచారణ జరిపి ఆ స్థలం ఎవరిదో తేల్చాలని కలెక్టర్‌కు సమర్పించేందుకు నివేదికను సిద్ధం చేశారు. రహదారి భవనాలశాఖ అధికారులు రోడ్డును సర్వే చేయాలని, రెవెన్యూ రికార్డులపరంగా ఆ స్థలం నగర పంచాయతీకి చెందిందా.. ఆలయానికి చెందిందా అనే విషయాన్ని నిర్ధారించాలని తహసీల్దార్‌కు వినతులు పంపినట్లు కమిషనర్ చెప్పారు.

కనుల పండువగా గంగజాతర


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మదనపల్లె సిటీ: నలవీర గంగాభవానీ (సీటీఎం) జాతర బుధవారం కనుల పండువగా ప్రారంభమైంది. ఉదయం మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. నలవీరగంగాభవానీ అమ్మవారి పుట్టినిల్లయిన మిట్టపల్లె నుంచి పసుపు, కంకుమ, చీర, సారెను తెచ్చి సమర్పించారు. సీటీఎం క్రాస్ సర్పంచు బండపల్లి ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో మిట్టపల్లి మేకల వంశస్తులు గంగమ్మకు తొలిపూజ. పట్టుచీర సమర్పించారు. జాతర పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. జాతరకు వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు సీటీఎం-1 సర్పంచు ఆనందపార్థసారథి, పొగాకు వీరప్రతాప్, వెలుగు చంద్ర, పారపట్ల సురేంద్రరెడ్డి తెలిపారు. బండపల్లి అక్కులప్ప, రమణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పూల నాగేంద్ర, పోతబోలు నాగరాజు, ఈశ్వర్ పాల్గొన్నారు.


అమ్మవారికి సారె తీసుకెళ్తున్న మిట్టపల్లె గ్రామస్తులు